క్లుప్తంగా

ఆయాసం బాధతో వృద్ధుడు ఆత్మహత్య



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): ఆయాసం బాధ తాళలేక ఓ వృద్ధుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన మార్రెళ్ల రామకోటయ్య (70) కొన్ని సంవత్సరాలుగా ఆయాసంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. రోజురోజుకీ వయస్సు కూడా మీదపడుతుండటంతో ముందుల ప్రభావం కూడా అంతగా పనిచేయడం లేదు. దీంతో ఆయాసం బాగా ఎక్కువయ్యింది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు. ఈ మేరకు గురువారం మృతుని భార్య మార్రెళ్ల సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ..

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గోరంట్లకు చెందిన కోటి కృష్ణారెడ్డి (35) విద్యానగర్‌లో ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మానసికంగా కుంగిపోయాడు.దీంతో గురువారం విద్యా నగర్‌లోని కార్యా లయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి డబ్బుల ఎగవేతపై కేసు

పట్నంబజారు: పత్తి కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న నలుగురిపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసు స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటుకూరు రోడ్డులో నివాసం ఉండే హరికృష్ణ యడ్లపాడుకు చెందిన నలుగురు పార్టనర్లు ఉన్న స్పిన్నింగ్ మిల్లుకు రూ. 9.50 లక్షల విలువ చేసే పత్తిని విక్రయించారు. దీనికి సంబంధించిన నగదు ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మరికొంత మందికి నగదు ఇవ్వలేదని తెలిసిందని చెప్పారు.

గుండె పోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

లింగంగుంటపాలెం(కాకుమాను): గుండె పోటుతో ఉపాధిహామీ కూలీ మృతి చెందిన ఘటన లింగం గుంటపాలెం గ్రామంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. తోటి కూలీలు, సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ వలీ(68) గురువారం ఉపాధి పనులకు వెళ్లాడు. పది నిమిషాల్లో పనులు ముగిసే సమయానికి మస్తాన్‌వలీ ఒక్కసారిగి కుప్పకూలిపోయాడు. ఆయనను గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువెళ్లి పరీక్షించగా.. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మస్తాన్‌వలీ మృతదేహానికి నివాళులర్పించారు.

వైద్యశాలను సందర్శించిన ఏపీ సాక్స్ బృందం

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలను ఏపీ సాక్స్ సీడీసీ, వీహెచ్‌ఎస్ బృందం గురువారం పరిశీలించింది. హెచ్‌ఐవీ కార్యక్రమాల్ని మెరుగు పరిచే విషయాలపై వైద్యశాల సూపరెంటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణితో చర్చించారు. ఓపీడీలో హెచ్‌ఐవీ పరీక్షలు చేయడానికి ఉన్న అంశాలపై మాట్లాడారు. బృందం సభ్యుల్లో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ తరుణ్, డాక్టర్ విజయరామన్, పి.వెంకట్, రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ చంద్రశేఖరన్, జ్యోతుల వీరాస్వామి ఉన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి



తెనాలి అర్బన్: తెనాలి ఆర్టీసీ డిపో అభివృద్ధికి ఉద్యోగులంతా కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ సూచించారు. తెనాలి డిపోను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో ఐదు డిపోలున్నాయని చెప్పారు. ప్రజారవాణా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొట్టమొదటి సారిగా తెనాలి వచ్చినట్లు తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రెండు నెలలకు ఒకసారి డయల్ యువర్ ఆర్‌ఎం, నెలకు ఒకసారి డయల్ యువర్ డీఎం కార్యక్రమాల్ని క్రమంతప్పకుండా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అరుణాచలం గిరి ప్రదర్శన సర్వీసులకు ఆదరణ ఉందని, దాన్ని కొనసాగించనున్నట్లు చెప్పారు. గుంటూరు-తెనాలి నాన్‌స్టాప్‌ల స్థానంలో సింగిల్ స్టాప్ అల్ట్రా పల్లె వెలుగు బస్సుల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. అనుమతులు రాగానే సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. తెనాలిలో బస్సు బయలుదేరితే నారాకోడూరులో స్టాప్ ఉంటుందని, అక్కడి నుంచి నేరుగా గుంటూరు వెళ్తుందని చెప్పారు.

అయినవారు ఉండగా.. బయటవారు దండగ !

- జీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్వీపింగ్ కోసం ప్రత్యేక సిబ్బంది కేటాయింపు
- జూలై 1 నుంచి విధులు నిర్వహిస్తున్న సదరు సిబ్బంది
- గురువారం విధులకు గైర్హాజరు

నెహ్రూనగర్: రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా ? అనే చందాన జీఎంసీ ఇంజినీరింగ్ అధికారుల వ్యవహార శైలి ఉంది. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎప్పటి నుంచో పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా వాష్ రూమ్‌లతో పాటు అధికారుల రూముల్ని కూడా శుభ్రం చేస్తూ వస్తున్నారు. అయితే, ఇంజినీరింగ్ అధికారులు ఈ విధానానికి తెర దించారు. కార్పొరేషన్ సిబ్బంది ఉండగా కార్యాలయాన్ని శుభ్రం చేయించేందుకు ప్రత్యేక కాంట్రాక్ట్ సిబ్బందిని పెట్టుకున్నారు. ఇప్పుడు వారు సక్రమంగా విధులు నిర్వహించకపోవడం నగరపాలక సంస్థలో చర్చనీయాంశంగా మారింది.

మూడు నెలలకు రూ.5.30లక్షలు

గతంలో గుంటూరు నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికులు ఐదుగురు ఉండేవారు. అయితే, వీరు సక్రమంగా శుభ్రం చేయడం లేదని ఇంజినీరింగ్ అధికారులు భావించారు. విజయవాడ, వైజాగ్ తదితర నగరపాలక సంస్థ కార్యాలయాల్లో శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించుకున్నారని తెలుసుకుని అదే పాలసీని గుంటూరు నగరపాలక సంస్థకు అపాదించారు. ఇందుకోసం ప్రత్యేకంగా టెండర్ పిలిచారు. దానికి సంబంధించిన నిధుల కోసం నగరపాలక సంస్థ జనరల్ ఫండ్స్ ద్వారా మూడు నెలలకు రూ. 5,30,00 లక్షలు కేటాయించారు. దీనికి సంబంధించి ఆరుగురు వర్కర్లు, ఒక సూపర్‌వైజర్ జూలై 1వ తేదీ నుంచి విధులు నిర్వహిస్తున్నారని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. తీరా వారైనా సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారంటే అది లేదు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నగరపాలక సంస్థ కార్యాలయంలో వర్షపు నీరు చేరింది. గురువారం విధులకు వచ్చిన వారు వాటిని శుభ్రం చేయకుండా మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో చేసేదేమి లేక శానిటరీ వర్కర్లతో కార్యాలయం మొత్తాన్ని శుభ్రం చేయించారు.



నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

విజయవాడ నుంచి వచ్చి గుంటూరులో విధులు

విజయవాడకు చెందిన ఓ కాంట్రాక్ట్ సంస్థ నగరపాలక సంస్థ కార్యాలయాన్ని శుభ్రం చేసేందుకు టెండర్ దక్కించుకుంది. నిర్వాహకులు సిబ్బందిని ప్రతి రోజూ విజయవాడ నుంచి గుంటూరుకు పంపిస్తున్నట్లు సమాచారం. వారు ఎప్పుడు వస్తున్నారో..ఎప్పుడు వెళుతున్నారో? కార్యాలయ సిబ్బందికి కూడా తెలియట్లేదంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

> **కార్యాలయం శుభ్రంగా ఉంచేందుకే నియమించాం**
>
> విజయవాడ, వైజాగ్ నగరపాలక సంస్థ కార్యాలయాల్లో, సచివాలయం కార్యాలయాల్లో ప్రైవేట్ ఏజెన్సీలు టెండర్ ద్వారా కార్యాలయాల్ని శుభ్రం చేయిస్తున్నారు. ఇదే తరహాలో గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచేందుకు టెండర్లు పిలిచాం. విజయవాడకు చెందిన కాంట్రాక్ట్ సంస్థకు టెండర్ దక్కించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో జూలై 1 నుంచి విధులు నిర్వహిస్తున్నారు.
>
> – పి.వి.కె.భాస్కర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, గుంటూరు నగరపాలక సంస్థ

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా పార్టీ ఉపాధ్యక్షుడు ఈమని మాధవరెడ్డి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధన కోసం బీజేపీ ఎల్లప్పుడూ పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ ముకుటం శివ, ఓబీసీ మోర్చా అవుల నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పిశెట్టి రంగారావు, జిల్లా కార్యదర్శులు కత్తి మేరీ సరోజిని, వెంకటేష్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలూరు లక్ష్మి, తోట సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు.

రేపు మాదిగ విద్యార్థులకు ప్రోత్సాహకాల ప్రదానం



సమావేశంలో మాట్లాడుతున్న బాలస్వామి

నెహ్రూనగర్: ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్ర, జిల్లాస్థాయిలో ప్రతిభ కనపరిచిన మాదిగ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు అసోసియేషన్ గౌరవ సలహాదారు సీహెచ్. బాలస్వామి తెలియపారు. 13 ఉమ్మడి జిల్లాల్లో టాపర్లుగా నిలిచిన వారికి ఈ నెల 8న సాయంత్రం 4 గంటలకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మాదిగ విద్యార్థులకు రూ.50వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.30వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.20వేలు, 13 ఉమ్మడి జిల్లాల్లో టాపర్లుగా నిలిచిన వారికి రూ.10వేలు చొప్పున బహుమతుల్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లెపోగు రవిరాజు పాల్గొన్నారు.

దేశానికి జగ్జీవన్‌రామ్ సేవలు ఆదర్శనీయం



యూనివర్సిటీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ తదితరులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డెప్యూటీ మేయర్ షేక్ సజీల



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏసుబాబు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రకాష్

ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్

ఏఎన్‌యూ: దేశంలో దళిత, అణగారినవర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ ప్రవేశ పెట్టిన సంస్కరణలు ఎప్పటికీ అనుసరణీయమని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. యూనివర్సిటీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జగ్జీవన్‌రామ్ వర్ధంతికి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీలోని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయాల్ని సమాజానికి చేరువ చేయాల్సిన బాధ్యత విద్యార్థులు, యువతపై అధికంగా ఉందని తెలిపారు. రాజకీయ, సామాజిక అంశాల్లో ఆయన చేపట్టిన చర్యలపై అధ్యయనం జరగాలని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశానికి ఎంతో విలువైన సేవలు అందించారని కొనియాడారు. యూనివర్సిటీ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు మాట్లాడుతూ కేంద్రం ద్వారా ఆయన సిద్ధాంతాలు, పలు రంగాల్లో ఆయన అందించిన సేవలపై అధ్యయనం కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు ఆచార్య స్వరూపరాణి, ఆచార్య గంగాధర రావు, ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, ఆచార్య ప్రమీలారాణి, ఆచార్య శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నాగ రాజు, ఆచార్య రత్నాకర్, ఆచార్య అశోక్ కుమార్, ఆచార్య త్రిమూర్తిరావు, ఆచార్య వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ ఇంజినీర్ కుమార్‌రాజు, వికాస అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, శ్రీనివాసరావు, పలువురు అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

మహనీయుల స్ఫూర్తితో సీఎం జగన్ పాలన

పట్నంబజారు: మహనీయుల్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతి పురస్కరించుకుని హిందూ కళాశాల సెంటర్‌లోని ఆయన విగ్రహానికి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కలసి డొక్కా మాణిక్య వరప్రసాద్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగానికి ఎన్నో సేవలు అందించిన ఘనత జగ్జీవన్‌రామ్‌కు దక్కుతుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆయన పాటుపడ్డారని చెప్పారు. జగ్జీవన్‌రామ్ ఆలోచనల్ని ముందుకు తీసుకెళ్లే విధంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాటు పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేసిన జగ్జీవన్‌రామ్ అడుగు జాడల్లో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని చెప్పారు. అనంతరం బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పరిపాలన దార్శనికుడు

నెహ్రూనగర్: దేశంలో ఎన్నో అత్యున్నత పదవులు నిర్వహించి, వాటికి వన్నె తీసుకువచ్చిన పరిపాలన దార్శనికుడు డాక్టర్ జగ్జీవన్‌రామ్ అని నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల పేర్కొన్నారు. మాయాబజార్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు ఆధ్వర్యంలో నగరంలోని సంఘ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అబ్రహాం, రమేష్, శ్రీను, సురేష్, సుబ్బయ్య, పూర్ణయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పదవులకు వన్నె తెచ్చిన మహనీయుడు

యుక్త వయస్సు నుంచే నెహ్రూ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన జగ్జీవన్‌రామ్ సమాజానికి ఎంతో సేవ చేసిన మహనీయుడని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో అత్యున్నమైన పదవులు నిర్వహించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మహనీయుడని కీర్తించారు. సంఘ నాయకులు జెల్ది మోహన్, నల్లపు నీలాంబరం, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో అర్ధ చాతుర్మాస మహోత్సవం



తెనాలి టౌన్: శ్రీశైలం మహాక్షేత్రంలో శ్రీ సాలీగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలస్వామిజీ పర్యవేక్షణలో అర్ధ చాతుర్మాస మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం చంద్రమౌళేశ్వరస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారికి విశిష్ట పూజలు జరిపారు. భక్తులకు చాతుర్మాత విశిష్టత గురించి బాలస్వామీజీ అనుగ్రహ భాషణం చేసి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మఠం జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య దంపతులు, కోశాధికారి గోపు రామకృష్ణ దంపతులు, ఏలూరి రాజేశ్వరరావు దంపతులు, చుండూరు శ్రీరామ్‌బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి



పట్నంబజారు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆ విభాగ డీఎస్పీ ఎం.బాలసుందరరావు చెప్పారు. నగరంలోని భాష్యం పాఠశాల వద్ద గురువారం సాయంత్రం విద్యార్థులకు ట్రాఫిక్ వెస్ట్ సీఐ అక్కేశ్వర రావు నేతృత్వంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కార్యక్రమంలో సీఐ అక్కేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మేనమామలా జగనన్న భరోసా

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: విద్యార్థులకు మేనమామలా తానున్నానే భరోసాని కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. వసంతరాయపురంలోని లూర్దు హైస్కూలులో గురువారం అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని 30,820 మంది విద్యార్థులకు రూ. 40.6కోట్లను తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ పేద విద్యార్థులకు చదువు'కొనే' పరిస్థితుల నుంచి చదువుకునే పరిస్థితులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వాలు కేవలం కార్పొరేట్ పాఠశాలలకే ప్రాధాన్య తిచ్చేవని, ప్రస్తుతం సీఎం వై.ఎస్. జగన్ ప్రభుత్వ బడుల్లోనే కార్పొరేట్ స్థాయి విద్యను అందజేసేలా అనేక పథకాల్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్ దూపాటి వంశీ, వైఎస్సార్ సీపీ నేతలు నూరి ఫాతిమా, మరియమ్మ, జేపీరెడ్డి, దాసు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మహేష్, అనిల్, అజయ్, అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా తదితరులు

అన్ని వర్గాలకు మేలు జరిగేలా సంక్షేమం

ప్రతి వర్గానికీ మేలు జరిగేలా పలు సంక్షేమ కార్యక్రమాల్ని దేశంలో తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతోపాటు, తక్షణమే అధికారుల దృష్టికి వాటిని తీసుకెళ్లి ఎమ్మెల్యే ముస్తఫా పరిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎన్నో ప్రజల సమస్యల్ని చేపడుతున్నట్లు చెప్పారు. అవసరమైన సేవల్ని సత్వరమే సచివాలయాల సిబ్బంది ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గడపకు సంక్షేమాన్ని అందజేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నేత షేక్ నూరి ఫాతిమా, డెప్యూటీ మేయర్ షేక్ సజిలా, డివిజన్ కార్పొరేటర్ మెహమూద్, వైఎస్సార్ సీపీ నేతలు సుబ్బులు, నాగుల్‌మీరా, ఖాజా, ఆదినారాయణరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చిన్నారిని ముద్దాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

క్యాజువాల్టీలో 24 గంటలు ఆర్‌ఎంవోలు ఉండాలి



గుంటూరు మెడికల్ : సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ గురువారం ఆర్‌ఎంవోలతో సమావేశాన్ని నిర్వహించారు.క్యాజువాల్టీలో 24 గంటలు షిఫ్టుల వారీగా ముగ్గురు ఆర్‌ఎంవోలు విధుల్లో ఉండి రోగులకు వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు.

బాధ్యతగా వ్యవహరించాలి

నర్సింగ్ సిబ్బంది విధుల పర్యవేక్షణలో సూపరింటెండెంట్లు బాధ్యతగా తీసుకోవాలని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. సేవల్లో అజమాయిషీ లోపం కనిపిస్తోందని తెలిపారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లో ఉన్న ముగ్గురు నర్సింగ్ అధికారులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పలు విభాగాల్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్ట్రా సౌండ్ గది వద్ద అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించారు. రెండు స్కానింగ్ మిషన్లలో ఒకటి పని చేయడం లేదని అక్కడ ఉన్న సిబ్బంది చెప్పడంతో, వెంటనే బయో మెడికల్ ఇంజినీరును పిలిపించి మారమ్మతులు చేయించారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా స్కాన్‌లు తీసే విధంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రతకు ఐసీయూ, క్యాజువాల్టీలలో ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండేందుకు షిఫ్టుల వారీగా ముగ్గురు ఉండేటట్లు నియమించాలని ఆదేశించారు.క్యాజువాల్టీ తనిఖీలో ల్యాబ్ 24 గంటల పాటు పని చేయడం లేదని ఆయన గుర్తించారు. అక్కడ 24 గంటల పాటు బయో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్లను విధుల్లో ఉండే విధంగా ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సివిల్ సర్జన్, ఆర్‌ఎంవో డాక్టర్ సతీష్ కుమార్ ఉన్నారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై పోలీసుల దాడులు

పెదనందిపాడు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. గురువారం పెదనందిపాడు ఎస్‌ఐ వివరాల మేరకు.. మండల పరిధిలోని వరగాని గ్రామంలో ఊరి చివరన ఉన్న ఇంటిలో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారంతో ఎస్‌ఐ సిబ్బందితో దాడి చేశారు. 29 గోతాల్లో నిల్వ ఉంచిన 7.5 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, పోలీసుస్టేషన్‌కు తరలించారు. బియ్యం నిల్వ చేసిన డి.కోటయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ప్రత్తిపాడు15 క్వింటాళ్లు..

ప్రత్తిపాడు: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ప్రత్తిపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వివరాల మేరకు.. ప్రత్తిపాడు జెట్టిమిట్ట బజారులోని దూపాటి సుబ్బారావు ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారన్న సమాచారం బుధవారం రాత్రి ఎస్‌ఐ డి.రవీంద్రబాబుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలిసి ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోని ఓ గదిలో 44 తెల్లబస్తాల్లో నిల్వ చేసిన 1500 కేజీల రేషన్ బియ్యం గుర్తించి, సీజ్ చేశారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన ప్రత్తిపాడు గ్రామస్తుడు వసువర్తి ఏసయ్యను అదుపులోనికి తీసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు.



నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్